

# కమలాన్నే

శ్రీవత్స

తెల్లవారుతూ ఉండగానే మా రాముడు— తయారు అయినాడు. ఇదివరకు నాకున్నూ అయిదారు మాసాలనుంచీ మా ఆవిడకున్నూ వాడి పెళ్లి గొడవ పట్టింది.

వాడు పెళ్లి చేసుకోక పోవడానికి కారణము పెళ్లంటే ఇష్టము లేక మాత్రము కాదు. వాడి ఊహాపోహలకు నచ్చిన పిల్ల దొరకక లేదని ఎప్పుడూ చెపుతాడు. అసలు వాడి బుర్ర చెడి పోవడానికి కారణము నాకొక ఆపరేషలో వాడు చేరడమే. "ఇంగ్లీషు చదువు కొన్న పిల్లను పెండ్లి చేసుకోరా" అంటే "ఇంగ్లీషు చదువు కొన్న ఆడదానికి స్త్రీత్వము పోతుంది—అటూ స్త్రీ కాకుండానూ— ఇటు పురుషుడు కాకుండానూ— అదొక రకమయిన మధ్యమ ప్రకృతిగా తయారై ఊరు కొంటుంది. అటువంటి దానితో సంసార మేమిటి" అంటాడు.

మామూలు సంసార పక్షపు పిల్ల కేవలము చాకిరీ చేయడానికో—లేక పోతే పిల్లలను కనడానికో తప్ప మరొకందుకు పనికి రాదు అంటాడు. ఈ విధముగా దేనికేదో సమర్థకము చెపుతూ పెళ్లి చేసు కోకుండా మాత్రము ఉండి పోయినాడు.

ఉభయులమూ కాఫీ పుచ్చు కొంటూ ఉంటే మా ఆవిడ సంగతి కాస్త చెప్పి చూడండని సంజ్ఞలు నాకు చేయ సాగింది. నాకు కూడా విషయము జ్ఞాపకము వచ్చి అన్ని విధాలా బాగా కూడా ఉంటుందను కొని ఇక విషయము ప్రారంభింతా మనే ఉద్దేశ్యముతో "ఏమిరా—మొన్న బెజవాడ వెళ్లి వచ్చావే—ఆ సంబంధము గతి ఏమయింది" అన్నాను.

"పిల్ల అయితే చూపులకు బాగానే ఉంది. కాని ఎక్కువగా హిందీ చదువు కొన్నది. పయిగా తండ్రి హిందీ ప్రచారకుడుగా ఉన్నాడురా, లేక పోతే బాగానే ఉంటుంది. అదే ఆలోచిస్తూ ఉన్నాను అన్నాడు మా రాముడు.

"ఇదేమిటి రోయ్. కొత్త సంగతి చెపుతున్నావు. హిందీ చదువు కొన్నందువల్ల పెళ్లికి పనికి రాక పోవడ మేమిటి రా"

"మన వాళ్లకు జన్మతః కొంచెము చపల బుద్ధి. ఇక హిందీ చదివినారో—అసలు బుద్ధే పోతుంది. చూడడము లేదుటరా—హిందీ ప్రచారకులను. వాళ్లు తెలుగు దేశములో పుట్టి—తెలుగు దేశములో పెరిగి ఒక్క సంవత్సరము ఏ కాశీలోనో—ప్రయాగలోనో ఉండి వచ్చే సరికి కేవలము హిందూస్థానీ బ్రాహ్మణ వేషముతో ముఖములో ఏకళా కాంతులూ లేకుండా వెర్రి ముండాకులలాగా తయారు అవుతారు........"

"ఈ వెధవ సిద్ధాంతాలన్నీ నాకవసరము లేదు. ఇంతకూ యీ దేశములో ఏ ఒక్క స్త్రీ అయినా నీ దృష్టిలో భార్యగా ఉన్నదాన్ని ఎప్పుడయినా—ఎక్కడయినా— చూశావా—నీ కబుర్లు చూస్తే నా ఒళ్లు మండి పోతున్నది"

"మామా చెపితే ఏమన్నా అను కొంటా వేమో? కాని నా దృష్టిలో ఏమిటి—నిజముగా ఏ బుద్ధిమంతుడి దృష్టిలో నైనా భార్య అనే శబ్దాన్ని సార్థక పరుస్తున్న భార్యను చూస్తూనే ఉన్నాను."

"ఎవరురా అది. ఆ స్త్రీ— అదేదో దశము వేసు కొని పుట్టి ఉండాలి. నీ దృష్టికి నచ్చిందంటే అదేదో విపరీత మే—అయినా చెప్పు చూదాము"

"ఎవరో ఎందుకు మామా—నీ భార్య—అత్తయ్య అంత యోగ్యురా లయిన భార్య మనకారు వాళ్లలో ఎవరి కయినా ఉందా ?"

"సరే. అయితే చాలా సంతోషము. కనీసము నీ వయినా దాన్ని మెచ్చు కొన్నావు...ఏమేవ్ కమలా... నీ లాంటి భార్య రాముడికి కావలె నట........"

మా మాటలు పక్క గదిలో ఉండి వింటున్న కమలము నా మాటను "అయితే. మీరే చెప్పండి నా కన్న యోగ్యమయిన పిల్ల ఉన్నదని, ఆ పిల్లను చేసుకో మనీ—మీరు ఎరుగుదురు కదా దాన్ని......" అంది.

"రాముడూ—మా పిన మామగారికి ఒక్కతే కూతురు ఉంది. అది మీ అత్త కన్నా ఎంతో చక్కగా ఉంటుంది. మీ అత్త యింకా ఒక చాయ దాని కన్న తక్కువ. మా పిన మామాగారు నీకు తగిన మామ గారు కాగలరు—ఏమంటే ఆయనా నీ లాగానే నాన్ కో ఆపరేషనులో జైలుకు పోయి వచ్చారు కూడాను. పయిగా శారదా వివాహపు హడావుడి రోజులలో పిల్లకు పెళ్లి చేసి వేయ వలసినదని ఎందరు ఎన్ని విధాల చెప్పినా భీష్మీకరించుకొని కూర్చున్నాడు. అప్పుడాయన అందరి తోటి నాన్ కోఆపరేషన్ చేసినాడు. ఇప్పుడు అది పెద్ద మనిషి కూడా అయింది. ఆరు మాసాలయి ఉంటుంది—అది పెద్దది అయి. ఆ సంబంధము ఏ విధముగా ఆలోచించి చూసినా నీవు చేసు కో తగినదిగా కన బడు తున్నది. కావలె నంటే ఆ పిల్లను మా యింటికి పిలిపిస్తాను. నీవు చూడ వచ్చును. ఏమంటావు."

"అయితే చిన్నప్పటినుంచీ పల్లెటూళ్లో పెరిగింది కాదూ !"

"ఏడిశావు.........అయితే నా భార్యా మాత్రము పల్లెటూళ్లో పెరగక బస్తీలో పెరిగిందా ?"

"ఆదారి వేరు లే వోయి. అసలు పుట్టకలోనే ఉంటుంది. నీ వదినెగారు చూడు,—మీ ఆవిడ యిక్కడ లేదను కొంటూ—ఎట్లా ఉంటుంది ఆకారములోనూ—ప్రవర్తనలోనూ—"

ఇంతలో పక్కన వింటున్న మా ఆవిడకు కొంచెము కోపము వచ్చింది అని అనుకొంటాను—చొరవ చేసు కొని "పోనీయిండి—ఇష్టము లేక పోతే పోతుంది. పిల్లను చూస్తే బాగుంటుందేమో" అని మెల్లిగా అన్నది.

మా రాముడు క్షణము సేపు ఆలోచించి మందహాసముతో "ఆ పిల్లను యిక్కడకు పిలిపించి మనము చూసి ఏవో రిమార్కులు చేశామని వాళ్లు అనుకోవడము ఎందుకు ? మనమే ఏదో మంచి రోజు చూసి అక్కడికే—వాళ్ల యింటికే పోయి చూసి వద్దాము. అయినా మనకు యీ పెళ్లి సంబంధము విషయములో ఆ పిల్ల తాలూకు వాళ్లు ఎవళ్లయినా ఆహ్వానము చేయవలెను కదా,"

"సరే, లే వోయ్. ఈ పంతులు వేషాలు. ఈ వారములో మంచి రోజు చూసుకొని ఆ వూరు మనము ముగ్గురమూ వెళ్లుదాము"

"సరే. అట్లాగే ఆలోచింతాము."

"ఆలోచించడము కాదు. బయలు దేరక తప్పదు సుమా. ఎట్లాగూ ఆ పిల్లే నీ భార్య అని వ్రాసి ఉందిలే."

"ఎందువల్ల నేమి ?"

"నీకు పాతికె ఏళ్లు వచ్చినవి. మామూలు పిల్లయితే యీడూ జోడూగా ఉండదు. ఇంగ్లీషు చదువు కొన్నది అసలు పనికి రాదాయెను... పయిగా నాన్ కోప్ రేటరు కూతురు."

"సరే చూస్తాముగా"

* * * *

ఈ సంభాషణ అంతా వింటున్న మా అవిడ వాడు ఆ పిల్లనే పెళ్లి చేసు కొంటా డని నమ్మి వేసింది. ఇక ఈ ఉత్సాహాతిశయముతో ఎల్లుండి పోదామా ఆవల ఎల్లుండి పోదామా " అని మొదలు పెట్టింది.

పాపము అమాయకురాలు—తెలియదు. టాకీలో ఆపరేటరుగా పద్ధాలుగు సంవత్సరాలు కాలక్షేపము చేసిన వాడి మతి ఎంత వరకుపోయి ఉంటుందో కమలము ఊహించుకో లేక పోయినది. టాకీలో ఆపరేటర్లు అన్ని విషయాలకూ న కారము చెపుతారన్న సంగతి మొగ వాళ్లకే సరిగా బోధ పడ కుండా ఉంటే ఆడవాళ్ల కేమి తెలుస్తుంది? అందులో పుట్టుకతోనే నా వేలు విడిచిన మేనల్లుడు—రాముడు నా స్త్రీశబద్ధవాచ్యు డన్న సంగతి రెండు సంవత్సరాల నాడు కాపరానికి వచ్చిన కమలాని కేమి తెలుస్తుంది?

## ౨

సాయంత్రము షికారు పోవడానికి తోడు కోసరము రాముడు వచ్చాడు. రాముణ్ణి చూసే సరికి మా ఆవిడకు మరీ ఉత్సాహము ఎక్కువ యింది. ఇక తన మరిది అయి పోతున్నాడనే దాని నమ్మకము. అందుకోసరము అతి హడావుడిగా గబగబా యింత వుప్మా కాఫీ చేసి హారాత్తుగా పట్టుకొని వచ్చి మా ఎదట పెట్టింది.

ఆరగించడము ఆరంభించ గానే నాతో "శుక్ర వారము" అని మెల్లగా కమల అన్నది.

వెంటనే అంటే రాముడు ఏమంటాడో నను కొని కాస్త సేపు అయిన తర్వాత "ఏమిరా ఆవల ఎల్లుండి శుక్రవారము పంచమి—నక్షత్రము కూడా బాగా ఉంది. ఆ రోజున ప్రయాణము—" అన్నాను.

"సరే లేవోయ్, ప్రయాణము. తొందర లేమి వచ్చింది." అని రాముడు అన్నాడు. "ఒరే బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా పనికి రాద న్నారురా. అయినా నాకూ—కమలానికీ—నీవు ఒక యింటి వాడివి ఎప్పుడు అవుతావా అన్న ఆలోచన తప్ప మరొకటి లేదు........"

"సంతోషము. అయితే మనము ముందుగా బయలు దేర పోవడము నాకేమి సమంజసముగా కనబడడము లేదు......సరే పోతాము. పిల్లను చూస్తాము. పిల్ల కంటికి యింపుగానే ఉన్నట్టు తోస్తుంది. ఏదో మాటా గీటా చెవులకు యింపుగానే ఉంటుంది. నడక గిడక కూడా బాగానే ఉంటుంది. అయితే పెళ్లి అయి కాపరానికి వచ్చిన తర్వాత యోగ్యురాలయిన యిల్లాలుగా వుంటుందని నిర్ణయించడ మెట్లా? అందు కోసరము కొంచెము ఆలోచించి సావధానముగా బయలు దేరుదాము. తొందర లెందుకు?"

"చాలా బాగా ఉంది. అసలు ఇంకొక పని చేస్తే మరీ బాగా ఉండి పోతుంది. చేసుకో దలచుకొన్న దాన్ని తీసుకొని వచ్చి కొంత కాలము ఉంచుకొని చూస్తే నీకు వచ్చిన యీసంశయాలన్నీ పోతవి. ఏ మంటావు."

"నీదంతా వేళాకోళము—అయినా చెప్పు. నీ భార్యకున్న ఓర్పు—నేర్పరితనము—మాట పొందిక—చాకచక్యము.........అవన్నీ నీ భార్య పిన తండ్రి కూతురుకు ఉంటవని అనుకోవడము ఎట్లా?"

"అయితే"

"అందువల్ల మనము తొందర పడి పరుగెత్తుకొని వెళ్లడము మంచిది కాదంటున్నాను"

"సరే—వెళ్లము. ఆ పిల్ల నీకు నచ్చుతుందో నచ్చదో తేలడము ఏలాగు?"

"తేలే నాటికి తేలుతుంది."

"అయితే నీవు యీ విషయము తేల్చే వరకున్నా వాళ్ల పిల్లను పెళ్లి చేయ కుండా కని పెట్టుకొని కూర్చొమంట వుటరా?"

"పోనీ పెళ్లి చేసుకో మను. నేను చేసు కొంటానని వాగ్దానము చేశానా? వాళ్ల యిష్టము. వాళ్ల పిల్లను పెళ్లి చేసు కొంటే చేసు కొంటారు లేక పోతే లేదు.

"ఏమిటీ సమాధానము—నీ కిష్టము లేక పోతే చెప్పి వేయి ఆసంగతి."

“ నేను యిష్టములేదని అనడము లేదే—ఆలోచింతాము అని అంటున్నాను.”

“ నీ ఆలోచన అయ్యే సరికి పుణ్యకాలము కాస్తా దాటి పోతుంది.”

“ పోతే పోనియ్యి. ఏం చేస్తాము.”

“ నీ తల తిక్క సమాధానాలను ఇక భరించ లేను ”

“ అయితే యిట్లాటి విషయాలు నాతో మాట్లాడడము మాని వేస్తే ఆ బాధ ఉండదు కదా.”

“ ఈ ముత్తెమంత మాటా చెప్పడానికా యిప్పుడు వచ్చింది. సరే యిక నీ విషయము ప్రస్తావించను లే ”

## 3

ఒక వారము రోజులు వాడి పెళ్లి విషయ మయిన ప్రస్తావనే చేయడము మాని వేసినాను.. వాడు న్నూ ఆవిషయము నాతో మాట్లాడడము మాని వేసి నాడు. అయితే అప్పుడప్పుడు సోష్యలీజము (సామ్యవాదము)ను మాట్లాడుతూ — సంఘమూ — సాంఘిక మర్యాదలూ అందులో పరీస్త్రీ పురుషులు వివాహము చేసు కోవడమే దూష్యమనీ—ఇష్టము వచ్చిన వాండ్లు యిష్టము వచ్చిన వాళ్లతో సంసారము చేయడము భావ్యమనీ ఉపన్యాసాలు మాత్రేము యిస్తూ ఉండేవాడు.

తన చెల్లెలును ఏవిధముగా నైనా రాముడికి కట్ట వలెనని కమలము నిశ్చయించు కొన్నది. తాను జోక్యము కలగ జేసుకొని ఒక్క సారి రాముడితో స్వయముగా మాట్లాడి వేస్తే అంతా అయి పోతుందని—పిల్లను కూడా చూడ కుండానే ముహుర్తము నిశ్చయమ యి పోతుందని కమలము దృఢవిశ్వాసము.

కమలము సంగతి తలచుకొని—దాని వెర్రికి నాకు నవ్వు వచ్చి “ అయినా ప్రయత్నము చేసి మాడు. వాడు పిల్లను చూడడానికి బయలు దేరితే చాలు. నిజముగా నీవు గొప్ప సమర్థు రాలవని ఒప్పుకోక తప్పదు......నాకు మాత్రము నమ్మకము లేదు. ‘ బ్రహ్మచారీ శతమర్కటః’ అనే పద్ధతిలో వాడు తయారు అయినాడు,” అని చెప్పాను.

నా అంగీకారానికి కమల బ్రహ్మానంద పడి పోయి నది. నా అసాన్నిధ్యములో రాముడితో స్వయముగా మాట్లాడడానికి నేను ఒప్పు కొంటానని ఎన్నడూ కమల అనుకో లేదు. అమాయకురాలు “ ఆసాయంత్రమే రాముడు నాకోసరము వచ్చే సమయానికి నేను ఇంట్లో ఉండక పోతే తాను మాట్లాడడానికి కావలసినంత అవకాసము ఉంటుంద ” ని చెప్పింది.

రాత్రి బాగా పొద్దు పోయిన తర్వాత యింటికి చేరాము. షుమారు పది గంటలయి ఉంటుంది. తలుపు తట్టి నాను. కమల వచ్చి తలుపు తీసింది. ముఖమంతా గండు బారి పోయి ఉంది. తలంతా చింపిరిగా ఉంది. చీరే దో మాసి పోయినదిగా కనుపించింది. నా కా విపరీత వేషము చూసి చాలా ఆశ్చర్యము వేసింది. ఎగాదిగా ఏమి అయిన దన్నట్టు చూసినాను. బింగ మూతి పెట్టుకొని మాట్లాడకుండా ఊరుకొన్నది. పరిపరి విధాల మనస్సు పోయినది. ఎన్నో ఊహాలు క్షణ లేశ ములో నా మానసవీధిలో గిర్రున తిరిగి పోయినవి.

“ ఏమిటిది రాముడు అసలు వచ్చాడా ” అని సందేహాసముతో అన్నాను.

అదివరలో బిగ పట్టుకొని ఉన్న దుఃఖము కాస్తా ఒక్కసారి పొంగిపొర్లి పోయింది. కమల ఏడవ సాగినది. కళ్ల వెంట ఒకటే ధారగా వర్షము లాగా నీళ్లు కారడము మొదలు పెట్టినది. నాకు చాలా జాలి వేసింది. ఇంక పిచ్చి ఊహాలు మనస్సున పరుగెత్తినవి.

కమలాన్ని దగ్గరకు తీసుకొని చెక్కిళ్లు దువ్వుతూ—బుజ్జగిస్తూ—“ ఏమీ ఫరవా లేదు. భయపడ నక్కర లేదు. ఏమి జరిగినా నేను ఏమీ అనుకోను. నా హృదయము నీవు గ్రహించ లేవా?......”అంటూ ఎన్నో విధాల బతిమలాడుతూ అడిగి నాను.

కమలకు విచారము హెచ్చయి పోయినది. కాని మొదటి వరద మాత్రము తగ్గినది. ఎట్లాగో చిత్తము చిక్కబట్టి గద్గదస్వరముతో "అబల్ల మీద ఉత్తరము చూడండి" అంటూ ఉత్తరము యిచ్చినది.



"ఆ ఉత్తరములో ఇట్లా వ్రాసి ఉంది......

కమలాదేవీ—

మన సంభాషణకు—నీ స్నేహితురాలు మధ్యలో వచ్చినందువల్ల అంతరాయము కలిగినది. నా మనోగతాభిప్రాయాలను మన సంభాషణలో గ్రహించే ఉంటావని నమ్ముతున్నాను. నేను చెప్పిన విషయము భగవంతుడి దృష్టిలో దూష్యము కాదు. నీవు...వదలిపెట్టినందువల్ల భగవంతు డేమీ శిక్షించడు. అట్లా అనుకోవడము చాలా తెలివి తక్కువ...నా మాటలు నమ్ము. మనము లేచి పోయి సుఖముగా సముద్ర తీరమున మద్రాసులో కాపరము చేతాము. నీవు యీ భూలోకములో స్వర్గసౌఖ్యము అనుభవించేట్టు చేస్తాను. ఇది మీ ఆయనతో చెప్పినా తప్పలేదు. మనము వెళ్లి పో దలచుకొన్నట్లయితే ఆయన మనలను వారించలేడు. వారించ దలచుకొన్నా ప్రయోజనము ఉండదు. ఏ మంటావు... ఒకవేళ ఆయనతో యీ విషయము చెప్పే ట్లయితే ఆయన ఏడ్చి పోతాడని అనుకొన్నట్లయితే ఆయనతో చెప్ప నవసరమే లేదు...ఎల్లుండి ఆదివారము నాడు ఆయన ఊళ్లో ఉండడు. ఆ రోజు మెయిలులో మనము వెళ్లి పో వచ్చును. ఇందుకు సమాధానము వ్రాత మూలకముగానే వ్రాస్తే ఎంతో సంతోషిస్తాను.

ప్రియుడు

రామారావు

ఉత్తరము కొంత దూరము చదివే సరికి కోపమూ—నవ్వూ రెండు వచ్చినవి. సరే ఆ వెర్రి వెధవ ఏదో బహుశః రష్యాదేశము అక్కడి స్త్రీపురుషుల వ్యవహారములూ అన్నీ ఉపన్యాస మిచ్చి ఉంటాడు. బాగానే ఉంది. ఆ తర్వాత ఎవరో ఆడవాళ్లు యింటికి వస్తే యీ ఉత్తరము వ్రాసి పెట్టి పోయి ఉంటాడు. ఇందుకు కమల కలవర పడి పోయి ఏడుస్తూ—నానా దరిద్రపు వేషముతో ఉండడము ఎందుకో బోధ పడింది కాదు.

నేను నవ్వుతూ "కమలా సరే. పిచ్చిసన్నాసి, ఏదో వ్రాసి నాడు. ఇందు కింత విచార మెందుకు? వాడి తిరువెంగడాయ వేషాలు నీకేమి తెలుసును?...తే. అన్నము తిందాము చాలా పొద్దు పోయినది." అన్నాను.

"అన్నము వండ లేక పోయి నాను"

"మంచి పని చేశావు అయితే ఏకాదశే"

"లేదు హోటలు నుంచి........"

"పీ మొహం—ఇప్పుడు అన్నము దొరకదు"

"అయితే స్టవ్ మీద వెంటనే అన్నము వండుతాను. ఏ ఊరగాయ ముక్కో వేసుకొని తిందాము" అని నేను జవాబు చెప్పక పూర్వమే వంట ప్రారంభించినది.

నిజముగా అయిదు నిముషాలలో అంటే నేను స్నానము ముగించే సరికి వంట అయి పోయి నది.

అన్నము దగ్గిర కమల "ఏదో మీకు దూరపు బంధు వనీ— ఎప్పుడూ మన యింటికి వస్తూ మీ కాఫ్తుడుగా ఉన్నాడనీ ఎంతో మంచి వాడనీ అనుకొని మా అమ్మా యిని ఇచ్చి పెండ్లి చేయింతా మని అనుకొని మాట్లాడ బోతే ఎంత దూరము తీసుకొని వచ్చాడండీ......నా కెంతో అవమానముగా ఉంది......" అన్నది.

సాభిప్రాయముగా, "ఇంకా ఏమి మాట్లాడినాడు? .........ఏం.........." అన్నాను.

"మీ స్నేహితుడు కాబట్టి బ్రతికి పోయినాడు. లేక పోయి నట్టయితే చీపురు కట్టతో శృంగారించే దాన్ని."

"అయితే మనలో మాట...ఏమి మాట్లాడి నాడు."

"వాడి తలకాయి—ఎక్కడో రష్యాదేశములు— వాడి శ్రాద్ధము—అక్కడ ఆడవాళ్లూ మొగవాళ్లూ పెండ్లి చేసు కో కుండానే సంసారము చేస్తారుట. అది చాలా మంచిదిట. మన దేశములో పెళ్లి అనేది పోయిన మర్నాడు మన కందరికీ స్వరాజ్యము వస్తుందిట. అందు కోసరము ముందుగా కొంత మంది వివాహము చేసు కొన్న వాళ్లు విచ్ఛేదము చేసుకొని తమ యిష్టము వచ్చిన వాళ్లతో ఉండి పోవాలిట. ఏమిటో...వెధవ..."

"ఇంతేనా?"

"ఈ ఉపన్యాస మిస్తుండగా పక్క యింట్లో ఉన్న అరవామె వచ్చింది. అంతటితో బ్రతుకు జీవుడా అను కొని ఆయన సంభాషణ కట్టి పెట్టి ఆమెతో మాట్లాడ డము మొదలు పెట్టాను. ఇంతలో ఆయన మీ గది లోకి వెళ్లి కలము కాయితము పుచ్చుకొని ఆ దిక్కుమాలిన ఉత్తరము బరికాడు. పయిగా వెళ్లుతూ "ఉత్తరము వ్రాసి పెట్టాను. చూడ"మని కూడా చెప్పి వెళ్లి పోయి నాడు.

"నీ గర్వానికి శృంగభంగము అయినది తే—చాలా సంతోషము" అని పకాపకా నవ్వడము మొదలు పెట్టి నాను.

కమలమును పట్టరాని కోపము వచ్చి "ఏమిటండీ నవ్వుతారు. ఏడవ వలసిన దానికి ఉత్తరము చూసిన తర్వాత నేను చచ్చి పోదామని అను కొన్నాను." అన్నది.

"నేను ఆడదాన్ని కాను—చేత కానప్పుడు ఏడుస్తూ కూర్చో డానికి," అని మళ్లీ కాస్సేపు అయిన తర్వాత పకాపకా నవ్వాను.

ఆదివారము ఉదయము ప్రయాణము అయినాను. కమల రాగాలు పెట్టడము మొదలు పెట్టినది. కాని నా ప్రయాణము మాను కో డానికి వీలు లేనది. ఏమి చేయ డము? సోమవారము ఉదయమును రిజిస్ట్రారు ఆఫీసులో హాజరు కావలెను. ఆ వూరు పోవలె నంటే ఆదివారము ఉదయము బయలు దేరితే సోమవారము వుదయానికి చేర వచ్చును. కమల గొడవ చూసిన కొద్దీ నా మనస్సు కదిలి పోయి ఏదో సాంత్వన వాక్యాలు చెప్పి మధ్యా హ్నము బయలు దేగు దా మనుకొన్నాను.

అందుకే కమల ఎంతో సంతోషపడింది. భోజనము చాలాత్వరగా ముగించి యిక కర్తవ్యాన్ని గురించి ఆలోచ నలు ప్రారంభించినాము.

"వాడు వచ్చినా నీపేరు పెట్టి పిలవడు కదా. నా పేరు పిలుస్తాడు. లేరని సమాధానము చెప్పు. తలుపు తియ్య బోకు, వాడు వెళ్లిపోక ఏమి చేస్తాడు."

"నా పేరే పిలుస్తా డనుకోండి. పలకక పోతే పలికే దాకా అరుస్తాడు. తలుపు తీస్తా ననుకోండి, అమాంతము లోపల ప్రవేశించి........"

"వాడు అట్లాచేసే స్వభావము కలవాడు కాడు."

"ఏమో మీరు అను కొన్నట్టుగా జరుగు తుందా,"

"అయితే పట్టు కొని తన్ను"

"అమ్మయ్యో అంత పని నాచేత కాదు."

"సరే నేను వూళ్లో ఉన్న రోజులలో వాడు మొదట వచ్చి నాడు కాబట్టి నాతో చెప్పి ఏడ్చినావు. నేనే అప్పుడు లేక పోయి నట్టయితే ఏంచేసే దానివి"

"ఏమో నాకు తెలియదు."

"ఆ మాత్రము మాన రక్షణ చేసుకో లేని స్త్రీ ఉంటే నేమి——లేక పోతే నేమి."

ఈ మాటలకు కోపముతో మండి పోయినది. నాతో మాట్లాడడము కూడా మానివేసి ముంగమూతి పెట్టుకొని కూర్చున్నది.

రైలు టయిముకు బయలు దేరి వెళ్లి పయిగా పది అణాలు దండగ బెట్టి టిక్కట్టు కూడా కొనుక్కొన్నాను. తీరా ఆ వూరు వెళ్లడానికి స్టేషన్‌లో దిగే సరికి మర్నాడు బక్రీదు పండగ అనీ——సర్కారు సెలవు దిన మనీ తెలిసింది. ఇక వెంటనే అత్యంతానందముతో వెనకకు తిరిగి నాను. కమలము స్థితి ఏ మయినదో ఏమిటో నను కొంటూ ఇంటికి వచ్చి నాను.



మునిసిపల్ దీపందగ్గిర

ఇంటికి వచ్చేసరికి రాత్రి ఎనిమిదిన్నర గంట లయినది. మా యింటి సమీపములో మునిసిపల్ దీపం దగ్గర నిలుచుని ఏదో కాయితములో అక్షరాలు పోల్చు కొంటూ ఉన్నాడు మా రాముడు. వాణ్ణి పోయి కదిలించి మాట్లాడ డానికి ఇష్టము లేక పోయినది.

ఇంట్లోకి వెళ్లే సరికి కమలము నిర్ఘాంత పోయినన్ను కౌగలించు కొన్నది. నా నోట్లో నుంచి మాట రాక పూర్వమే కమల కథ ప్రారంభించింది.

"నిజముగా——మీ రాముడి కేదో మతి పోయి ఉంటుం దండి... సాయంత్రము కాగానే యిక నెట్లాగూ వస్తా డను కొని పక్క యింట్లో ఉన్న అరవ ముసలమ్మను ఎట్లాగో తోడు రమ్మని పిలిచాను. ఆమె వచ్చి కూర్చుని మాట్లాడు తున్నది. చీకటి పడగానే మీ రాముడు వచ్చాడు. కమలా దేవీ అని నోటూరా పిలిచాడు. తలుపు తెరిచాను. నా ఒళ్లు మండి పోతున్నది. ఆ పాళంగా యింట్లోకి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. నేను యథా ప్రకారముగా ముసలమ్మతో మాట్లాడు తున్నాను.

"నా అభిప్రాయానికి ఏమి నిశ్చయించి నావు" అన్నాడు. నేను వినిపించుకో లేదు. నావంక చూస్తూ "నీవు ఎంత వినిపించుకోక పోయినా——నీవు సమా ధానము చెప్పేదాక వెళ్లి పోదలచుకో లేదు." షుమారు ఒక గంటన్నర సేపు అట్లాగే కుర్చీలో కూర్చున్నా వదిలెటట్టు కనుపించ లేదు. ముసలమ్మ కీ విషయ మంతా తెలియడము నా కిష్టము లేక పోయినది. లేక పోతే వెనుక నుంచే వెళ్లి కుంచె చీపురు పిడితో తల కాయ మీద రెండు అంటింతామను కొన్నాను. అల్లరి అయి అందరికీ తెలిసి పోతుందేమో నను కొన్నాను. పక్కను కూచొని మాట్లాడు తున్న ముసలమ్మకు తెలియడము అసలే నా కిష్టము లేదు. అందు కోసరమని అతను చేసిన పనే చేదామను కొని ఒక కాయితము తీసుకొని రెండు పంక్తులు వ్రాసి ఆయన కిచ్చి——బయటకు వెళ్లి చదువు కోండి——అన్నాను——ఆ కాయితము తీసుకొని వెంటనే లేచి పోయినాడు."

"అయితే ఏమని వ్రాసినావు"

"ఇదిగో నకలు అట్టి పెట్టాను." అని చూపించింది. అందులో ఈ విధముగా ఉంది.

"మీరు ఇట్లాంటి ప్రయత్నాలకు మా యింటికి వస్తే చీపురు కట్టలకూ చెప్పులకూ చాలాపని కలుగు తుంది——"

"ఇంతే నా"

"ఇంత కంటే ఇంకా ఏమి కావలెను."

"దస్కతు అయినా లేదే"

"ఇందుకు దస్కతు కూడా ఎందుకు?"

"బలే పని చేశావు. అయితే ఉత్తరము తీసుకొని ఏమి చేశాడు."

"ఆ ఉత్తరములో వాడి శ్రాద్ధము ఏదో ఉందను కొని వెంటనే బయటకు వెళ్లి పోయినాడు——ఒక పావు గంట సేపయి ఉంటుంది. ఇంతలో మీరు వచ్చినారు."

"అదే కాబోలు వాడు మనయింటి పక్క లాంతరు కింద నిలుచుని ఏదో చదువు తున్నాడు."

"కాబోలు వెర్రి వెధవ"

నేను నవ్వుతూ "అయితే ఉదయము కాఫీకి రమ్మని పిలుస్తాను"

"వాడి మొహాము నే నిక చూడను"

——:O:——




అక్షరాలు ముత్యాల కోవలు!

"రత్నా యింప్రూవ్డ్"

కలాలతో వ్రాస్తే ముత్యాలవంటి అక్షరాలు కుదుర్తాయి. ఇవి చాలా కాలం పనిచేస్తాయి.

నిప్పుక ముండవు; విరగిపోవు; తళతళ లాడుతుంటాయి. మంచి అందమైన బంగారు పాళీలు. వాని చివర 25-వ సంవత్సరములవఱకు పనిచేసే యిరిడియమ్ పొదగబడింది.

రకరకాల రంగులతో, రోల్డుగోల్డు క్లిప్పులతో ముద్దులు మూటగట్టే ఈకలాల వెల సరసం.

కావలెనంటే మీమీ పేర్లు కలాలపైన ఉచితంగానే చెక్కుతాం.

కావాలి మీ అందఱి ప్రోత్సాహం.

కె. రత్నా అండ్ కో.,
విద్యార్థులకు ప్రియమైన షాపు.

305, ఎస్ప్లనేడ్ రోడ్,
మద్రాసు.